
రాంషా

# చలువరేడా! చందమామా!!

కలువరారా కలువరాయా అని ప్రియంగా ప్రేమతో పిలిస్తే నీతులు చెబుతున్నావా?

అవి నే నెరుగని నీతులా ఏమి?

ప్రతిరోజూ ధర్మోపదేశంలాగా దేవగురువు, నీ ప్రియ గురువు శ్రీ శ్రీ శ్రీ బృహస్పతుల వారు వాచస్పతులై వల్లెంచేవే లే! అవి నాకేం కొత్తకాదోయీ!

నువ్వు యీ ఆశ్రమానికి చదువుకోసం వచ్చిన నాటినుండి మదినాటిన మోహంతో చెలరేగిన వ్యామోహంతో నువ్వేలోకంగా నువ్వే దైవంగా భావించి పూజించాను. అంతవాడిని యింతవాడిగా పెంచినందుకు ఎంత వాడిగా మాటాడావు! అంత వాడి శిష్యుడివి కదా అంతలేసి మాటలు విసరకుంటే ఎలా!

ముద్దుల సుద్దులతో మోహం తీర్చకుండా హద్దుల సుద్దుల పద్దులు ముద్దు ముద్దుగా అప్పగిస్తున్నావా? అది నీ వాదరీతి. అయితే నావాడవైన నీవు నావాదరీతి విను

నువ్వెవరివి?
చంద్రుడివి.
నీకు [illegible]రుచంద్రుడు బృహస్పతి.
ఆయన [illegible]ిన ఇల్లాలిని నేను
గురుస్థానం నాదా? నీదా?
సుద్దులైనా ధర్మసూక్ష్మాలైనా నీకు నేనే నేర్పాలిరా వలరాయా! వలచినరాయా!
హుఁ నవ్వొస్తోంది నీ తీరుచూస్తుంటే-

అయినా యిలా నీతి వాక్యాలు వల్లించే నీ వంటి వాళ్లే నారీ కుచభోగ భోగానంద రసమే బ్రహ్మానందం అంటారు సుమా! ఆనందో బ్రహ్మ అనే మాటకు మా వరూధిని చెప్పిన అర్థం గుర్తుందా స్వామీ! అవును ఎండ కన్నెరుగ కుండా పెరగడమే కాదు ఏ కన్నెకాటూ ఎరగని వాడివి కాబట్టి యిలా మాటాడావు. కానీ ఒకసారి ఆ సుఖసాగరంలో ఓలలాడితే రతిసుఖసారం తెలిస్తే యిలా వాదుకువచ్చే వాడివా?

చక్కెర మోవిచ్చి చాన దప్పిక తీర్చడం మాని మానినికి హితోపదేశం చేస్తున్నావా? తదేకదీక్షతో వున్న వారికి యిలాంటి హితోక్తులు చెవికెక్కుతాయా

చంద్రా! లోకానికంతా నువ్వు చల్లని వాడివి! చలువ రేడువి! కానీ నాకో! మండే సూర్యుడిలా ఉన్నావు.

తాపమెక్కి తారుణ్యం తలకెక్కి నువ్వే నువ్వే కావాలి అని ఉబలాటపడే మోహనాంగిని నాకు నీ మంచిమాటలు చెవికెక్కుతాయా చంద్రా! మంచో చెడో నా నిర్ణయమే నిర్ణయం. అది మారదు. మారునాన మారదు.

అయినా -

ఎంత నిర్దయుడివిరా నువ్వు?

అబలను బేలనై వావిడిచి సిగ్గువిడిచి దీనంగా వేడుకుంటున్నా మనసుకరగడం లేదా? నువ్వేం చలువరాయడివి?

ప్రాణనాయకా!

మన్మథ బాణాలకి లొంగిపోయిన శరీరం మోహంతో పొంగిపోతున్నది. నిన్ను కోరివచ్చిన దాన్ని చిన్నదాన్ని. వలచినదాన్ని నన్ను పేక్ష చేస్తే మహాపాతకం సుమా! ఒక నిమిషమైనా యీ తాపం ఓర్వలేను. రా! నా శరీరాన్ని కానుక చేస్తాను.

హుఁ మొండివాడా!

పరోపకారం పుణ్యం అని చదువుకోలేదా? వినలేదా?

అవున్లే!

వనిత తనంత తా వలచి వస్తే చులకనే కదా మీ మగరాయళ్లకు!

నవ్వొస్తోంది తలుచుకుంటే

కోరి వచ్చిన వారి కోరిక తీర్చకపోతే యీ అందం... యీ చందం... యీ చతురత... ఈ యవ్వనం.. యివన్నీ వ్యర్థం కాదూ! అడవిని కాసే వెన్నెల్లాగా.. అవున్లే! నువ్వు వెన్నెల రేడువే కదా! నీకు కొండల్లో కోనల్లో వెన్నెల కురియడమే తప్ప రసికుల చెంగట.... సరసుల ముంగిట.... వెలుగులు గుమ్మరించడం ఏం తెలుసులే!

ఊపిరి తిప్పుకోకుండా **సంయనిష్ఠూరాలు** సాగించింది తార తా రససామ్రాజ్ఞిలా ఒక్కొక్కమాట హృదయశల్యంగా వుంది చంద్రుడికి మెల్లిగా అన్నాడు.

"............ సురేంద్రునకున్ గురుపత్నివై జగత్ పావన కీర్తి కాంచితివి పాడియె నీ కిటువంటి పోడుముల్"

ఆమాటా - యింకేదో పై మాటా విని, నేయి పడ్డ హుతాశనునిలా భగ్గున మండి అంది

'ఏమంటున్నావ్?'

ఇంద్రుడి గురుపత్నినై జగత్కీర్తి సంపాదించిన నాకు యిలాటి పోడుములు తగవు కొనంటావా? భళా! భళా! విప్పక విప్పక నోరు విప్పి మంచి ముత్యాల్లా మంచి మాటలే రాలేయిలే!

మొగుడు మొగుడు అనక మాటి మాటికి.....

భర్త ఎలాటి వాడైనా... ముసలి వాడైనా... మూఢుడైనా కురూపి అయినా... వాడ్నే దైవంగా భావించాలా?

అలా కాకపోతే.....

నాలాటిదే తెగిస్తే....

లోకంలో ఏ స్త్రీ మొగుడితో కాపురం చేయదా?

సిగ్గుగా లేదూ ఆ మాట అనేందుకు?

సరే !

నీమాటే విందాం! నీ మాట ప్రకారమే అందాం మగడిని అతిక్రమించి వరించడం మానినికి తగదన్నావ్. సరే!

మగడంటే ఎవడయ్యా?

మగని అతిక్రమించుటల్ మానినికిన్ తగదంటి - ఒప్పితిన్!
మగడు మగండనంగ మది మక్కువ ఎవ్వనియందొ కంటి కిం
పగు అత డెవ్వడో అతడె ఆతని కాదని అన్యు కూడినన్
తగదది కాముకీ జనుల ధర్మము మర్మము నే నెరుంగుదున్.

పలుకు.... సమాధానం పలుకు... పలుకవేం?

తెలియడం లేదా! చెప్పు! తాళి కట్టిన వాడే మగడా? ఊహూఁ కాదు చంద్రా!

మగడంటే......

మనస్సు ఎవడి మీద మక్కువ వుంటుందో ఎవడు కంటికి యింపుగా వుంటాడో వాడు...

వాడే మగడు!

నిజం! అతన్ని కాదని తలిదండ్రులు కట్టబెట్టారనో ధర్మమనో వేరే వాడితో కాపురం చేస్తే అది తప్పు.... అది రంకు... అదీ తగనిది తెలిసిందా?

అయినా నాకు తెలీక.అడుగతాఁ ఇన్ని నీతులు చెబ్తున్నావే? ఒక్కసారి మీ

వారి గత చరిత్ర గుర్తు తెచ్చుకో!

మీ పితామహుడు... తండ్రి తండ్రిగారు.. ఆ బ్రహ్మ ఉన్నాడే... ఆ సృష్టికర్త... కన్న కూతురనయినా అనుకోకుండా భారతిని వివాహమాడలేదా? ఇక మీ బావ... శ్రీ కృష్ణుడున్నాడే... ఆ శృంగార సామ్రాజ్య పట్టభద్రుడు... మేనత్త .... ఆ రాధికతో సింగారాల్లో బంగారాలు పూయించలేదా? ఇక మా పతిదేవుడు... మీ గురువు గారు.... బుద్ధికి బృహస్పతి.... ఆయన వదినతోనే వయ్యారాలు నయ్యాలాలా సాగించిన బుద్ధిమంతుడు కాదూ? ఆ గురువుగారి శిష్యుడు... నీ సహపాఠి... ఇంద్రుడు... అహల్యను చేరలేదా? చెరపట్టలేదా?

మాశావా! మీ వాళ్లంతా ఎంత వింత హేమాంతకాంద్రో? మీ వాళ్ల నడతలన్నీ అలవాటైనా దారి వుంటే అది కాదని నువ్వేంటి యిలా అంటావ్?

అయినా యీ ధర్మపన్నాలూ... యీ నీతి శాస్త్రాలూ.... యీ పురాణాలూ ఎవ్రరాశారంటావ్?

లోకములోన కొంద రబలుల్ సతులన్ తనియింపలేక అ
స్తోక మనీష అన్యపురుషుల్ తమ కాంతల అంటకుండ తా
టాకులలోన వ్రాసిరి పరాంగన కూడిన పాపమంచు అ
య్యాకుల పాటు చూచి ఇపుడాకుల పాటెనయంగ యేటికిన్

తెలిసిందా? బాగా విను...

లోకంలో కొందరు బలహీనులు తమ భార్యలను సరిగా చూసుకోలేక సంతృప్తి లేని సతీమణి ఏ దారిని వెడుతుందో అని - తమ స్త్రీలను పరపురుషులు ముట్టకుండా... పరాంగనా రతి పాపం అని తాటాకుల్లో రాసి పెట్టారయ్యా! ఆ తాటాకుల్లో తగలబడే శాస్త్రాల్ని గుర్తుకు తెచ్చుకుని యిప్పుడు ఆకులపాటు (కలత) చెందడం ఎందుకోయీ సుందరాకారా!

మహాపురుషా! అయినా యిన్ని మాటలెందుకోయీ!

నువ్వు నా మాట పెడచెవిన పెట్టి నన్నాట పట్టించి నా దారికి నన్నొదిలేస్తే ప్రాణం తీసుకుంటాను. ఆ పాపం నీదే సుమా!

చంద్రా నా నిర్ణయం విను!

ఒల్లను శీల మా మగని ఒల్లను కాపుర మొల్ల మాన మే
నొల్లను చుట్టుపక్కముల నొల్ల కులంబును ఒల్ల నా మనో
వల్లభ! నీదు కెంజిగురు వాతెర గ్రోలక మాన ఏల ఈ

కథా నిలయం
1592
శ్రీకాకుళం

ఒల్లని సుద్దు లింపెనసి ఉన్నదిసంబొకొట్టైన చాలదే!

నాకు కులం వద్దు! కాపురం వద్దు! శీలం వద్దు! ఆ మొగుడూ వద్దు. మొద్దులూ వద్దు. మట్టాలొద్దు. పక్కాలొద్దు. మాసం మంట గలవనీ! మర్యాద నట్టేట మునగనీ! నీ తీయని ముద్దు వెను తీయని కౌగిలి హద్దు... అవీ కావాలి! కావాలి! కావాలి!

ఇదిగో చెబ్తున్నా. విను!

వాదన వద్దు! వేదన తీర్చు! సుద్దు లొద్దు! ముద్దు లద్దు! వెకిలింతలు వద్దు! కౌగిలింతల దిద్దు!

హమ్మయ్య!

ఇప్పటికి కదలిక కలిగిందన్నమాట!

ఇక నిన్ను..... వద్దులే! మాట లెందుకులే! మాటల్లో రెండుసార్లు లే అంటున్నా లేవవేం? వద్దు - లే! మాటలెందుకు.. లే...ఆఁ ఇక చేతలతోనే చెబ్తాదాఁ

(శేషము వేంకటపతి కృతం శశాంక విజయంలోని తార మనోభావ యవనిక ఇది)

* * *